## తులం బంగారం ఏదీ?



**సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు**

సికింద్రాబాద్,మార్చి19: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి నిరాశను మిగిల్చే బడ్జెట్ ప్రవేశపెట్టింది . సంక్షేమం, అభివృద్ధికి పూర్తిగా తిలోదకాలు పలకడంతో పాటు ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించింది. పింఛన్ల పెంపు, కళ్యాణ లక్ష్మికి అదనంగా తులం బంగారం, రూ.2500 చొప్పున మహాలక్ష్మి పథకం, నిరుద్యోగ భృతి వంటి ఏ హామీలకు నిధులు కేటాయించ లేదు.

## సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు



**మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్ పేట్, మార్చి 19: అబద్ధాల పునాదుల మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో సంక్షేమం ఊసే లేదు. ఇచ్చిన హామీల ఆచూకీ లేదు. ఆరు గ్యారంటీల ప్రస్తావన బడ్జెట్లో లేదు. గత ప్రభుత్వం పైన ఆరోపణలు చేయడం, కేసీఆర్‌ను తిట్టడంతోనే రేవంత్ రెడ్డికి కాలం గడిచిపోతుంది. రైతులకు 100 శాతం రుణమాఫీ చేస్తామని అందులో సగం కూడా చేయలేదు. మహిళలకు ఇస్తామన్న తులం బంగారం గురించి ప్రస్తావన లేదు.

## సిటీ నీళ్లకు నిధులేవీ?



**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, మార్చి 19: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నగర ప్రజలు ఆశించినంతగా లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వాగ్దానాలతో ఊదరగొట్టింది. చెప్పిందొకటి చేస్తున్నదొకటని కాంగ్రెస్ పార్టీ తీరేవేరయ అని ప్రజలు అంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు, రానున్న ఎండకాలంలో ప్రజల గొంతు ఆరేటట్టు ఉంది. నీటి కోసం పానిపట్టు యుద్ధాలు జరిగే విధంగా బడ్జెట్ ఉంది. గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు నిధులు బడ్జెట్‌లో కేటాయించ లేదు.

## అన్ని రంగాల కార్మికులు రోడ్డున పడ్డారు

**మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్యే**



జూబ్లీహిల్స్ : గత ఏడాది బడ్జెట్లో కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా నోటికి వచ్చిన లెక్కలతో కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు అంటూ నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 15 నెలల పాలన పూర్తి చేసుకుంది. ఇప్పటికీ గ్యారంటీలు అమలు చేయడం లేదు. మహిళలకు 2500, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం లాంటి పథకాల విషయంపై బడ్జెట్లో లేదు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం గత బడ్జెట్లో ప్రకటించిన నిధుల్లో ఎన్ని ఖర్చు చేశారో తెలియదు. తప్పుడు నిర్ణయాలతో హైదరాబాద్ అభివృద్ధిని కుప్పకూల్చారు. నిర్మాణరంగంతో పాటు అన్ని రంగాల కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారు. వారి సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటారో బడ్జెట్ లో చెప్పలేదు.

## మహిళలకు 2500 ప్రస్తావనే లేదు

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



ఎల్బీనగర్, మార్చి 19: అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మోసం చేసే విధంగా ఉంది. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రగతిని బడ్జెట్ ద్వారా పరుగులు పెట్టిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండుసార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంకెల గారడి మాత్రమే చేసింది.మహాలక్ష్మి పథకంలో భాగంగా చెప్పిన ఆరు గారంటీల్లో ఏ ఒక్కటి సరిగా అమలైన దాఖలాలు లేవు. పెన్షన్ల పెంపు, నిరుద్యోగ భృతి, విదేశీ విద్య, మహిళలకు 2500 వంటి వాటి ఊసే బడ్జెట్లో లేకపోవడం ఆశ్చర్యకరం. హైదరాబాదులో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధి లేనందున హైదరాబాద్ అభివృద్ధిని నిర్లక్ష్యం చేసినట్లు తెలుస్తుంది. మెట్రో రైలుపై గతంలో సీఎం హామీ ఇచ్చి ఈ బడ్జెట్ లు మాత్రం మెట్రో రైల్‌ను విస్మరించడం స్పష్టంగా కనిపిస్తోంది.

## సూపర్ స్పెషాలిటీ దవాఖానలకు నిధులేవీ??

**బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద**



దుండిగల్, మార్చి 19: విశ్వ నగరాభివృద్ధిని బడ్జెట్ లో పూర్తిగా విస్మరించారు. బుధవారం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్లో మహానగరాభివృద్ధిపై దృష్టి సారించకపోవడంపై బాధాకరం. మహానగరాన్ని నలుమూలల అనుసంధానం చేస్తూ ఎంతోమంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో కు బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. తెలంగాణను పూర్తి ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శంకుస్థాపన చేసిన మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు బడ్జెట్ లో నిధులు కేటాయించలేదు. దీంతో నిరుపేదలకు అందాల్సిన మెరుగైన వైద్యం మరింత ఆలస్యం కానుంది.

## ఆరు గ్యారంటీలకు మంగళం పాడారు


**-ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



ముషీరాబాద్, మార్చి19 : బడ్జెట్ పేద ప్రజల కష్టాలు తీర్చేది లేదు. అరకొర కేటాయింపులతో ప్రజలకు దక్కేది గుండు సున్న. ప్రతి రంగానికి ప్రతి వర్గానికి వెన్నుపోటు, ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల హామీలకు మంగళం పలికారు. ఆటో డ్రైవర్ మొదలుకొని అన్నదాత వరకు అందరినీ వంచించారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీల గురించి బడ్జెట్ లో ప్రస్తావించలేదు. తులం బంగారం దిక్కు లేదు. చేనేత రంగానికి బీఆర్ఎస్ హయాలో 1200 కోట్ల రూపాయిలు కేటాయిస్తే, నేడు చేనేత కార్మికులకు 300 కోట్లకే పరిమితం చేశారు.

## వాగ్దానాలు ఆకాశంలో..ప్రతిపాదనలు పాతాళంలో


**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ఉప్పల్, మార్చి 19 : నగరానికి అరకొర బడ్జెట్లు కేటాయించడం శోచనీయం . గత ప్రభుత్వం కేటాయించిన నిధులతోనే నగర అభివృద్ధి జరిగింది. దేశానికే తలమానికంగా ఉన్న నగరానికి నిధుల్లో సరైన కేటాయింపులు జరగకపోవడం సరి కాదు. ప్రభుత్వ పనితీరు సరిగా లేకపోవడంతోనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోతున్నాయి. రేవంత్ రెడ్డి వాగ్దానాలు ఆకాశంలో ఉంటే, ప్రతిపాదనలు మాత్రం పాతాళంలో ఈ బడ్జెట్ చూస్తే అనిపిస్తుంది. గత బడ్జెట్‌లో చెప్పిన ఒక్క హామీ కూడా నెరవేరలేదు. ఇప్పుడు ఈ బడ్జెట్‌లో ఉన్న ప్రతిపాదనల పరిస్థితి కూడా అంతే. రేవంత్ రెడ్డి బుద్ధి మాంద్యం వల్ల రాష్ట్ర ఆదాయం పడిపోతోంది.

## అరచేతిలో వైకుంఠం చూపారు


**కాలేరు వెంకటేశ్**



అంబర్‌పేట, మార్చి19 రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం చూస్తే రాజకీయ ప్రసంగం లాగా ఉంది. అందులో పచ్చి అబద్ధాలు, అసత్యాలు చెప్పారు. ఎన్నికల ముందు అన్నీ చేస్తామని, అధికారంలోకి వచ్చాక ఏమీ చేయలేమనేలా ఈ బడ్జెట్ ఉంద 72 పేజీల బడ్జెట్‌లో పేదల సంక్షేమం కోసం నిధులేమీ పెంచలేదని తెలిపారు.

## రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ..

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**




కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 19: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీలా కనిపిస్తుంది. ప్రభుత్వం రైతాంగానికి చేయూతను అందించేందుకు మహిళలకు అండగా నిలిచేందుకు బడ్జెట్లో కేటాయింపులు లేవు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలకు తులం బంగారం కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. దళిత బంధు బీసీ బంధు లాంటి పథకాల ఊసు లేకుండా పోయింది. ప్రజలను మభ్య పెడుతూ ప్రభుత్వం పాలన సాగిస్తుంది. ఈ బడ్జెట్ తో ఎవరికి మేలు జరగదు. అంతా అంకెలగారడిగా మార్చి గొప్పగా ఉందని చెప్పడం బాధాకరం.

# ఉచిత నీటికీ మనసు రాలేదు

- గతేడాది 20కేఎల్ ఉచిత నీటికి చిల్లిగవ్వ ఇవ్వని ప్రభుత్వం
- ఈదఫా కాగితాలపై రూ.300 కోట్ల కేటాయింపులు
- గత ఏడాది లెక్కనే తాజా బడ్జెట్‌లో జలమండలికి రూ.3385 కోట్లు







సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ఉచిత మంచినీరు.. సామాన్యుడి హక్కు. కానీ కాంగ్రెస్ సర్కారు ఆ హక్కును సైతం కాలరాస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం మానవీయ కోణంలో అమలులోకి తెచ్చిన నిరుపేదలకు 20కేఎల్ ఉచిత మంచి నీటి పథకానికి రేవంత్ ప్రభుత్వం నీళ్లొదులుతున్నది. వాస్తవానికి హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను నిర్వహిస్తున్న జలమండలి ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఈ నేపథ్యంలో బోర్డుపై భారం లేకుండా కేసీఆర్ ప్రభుత్వమే ఏటా రూ.300 కోట్లను ఈ పథకానికి అందిస్తూ వస్తుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గతేడాది బడ్జెట్‌లో రూ.300 కోట్లు ఈ పథకానికి కేటాయించి నిధులు మాత్రం విడుదల చేయకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. నగరంలోని దాదాపు 8లక్షల మందికిపైగా నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే ఇలాంటి పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శించింది. ఇదిలా ఉంటే తాజా బడ్జెట్ కేటాయింపుల్లో జలమండలికి గత సంవత్సరం కేటాయించిన అంకెలనే ఈసారి బడ్జెట్‌లోనూ పొందుపరిచారు. కానీ గడిచిన సంవత్సరకాలంగా ఇందులో పావు వంతు కూడా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం.

### జలమండలికి రూ. 3,385 కోట్లు

హైదరాబాద్ మహా నగరంలో అత్యంత కీలకమైన తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థను నిర్వహించే జలమండలికి ప్రభుత్వం రూ.3,385 కోట్ల కేటాయింపులను చేపట్టింది. ఇందులో జలమండలి గతంలో మంచినీటి పథకాలకు తీసుకున్న రుణాల చెల్లింపులకే సింహభాగం కేటాయింపులు ఉన్నాయి. పలు పద్దుల కింద వీటి కేటాయింపులను చూపారు. వివిధ అభివృద్ధి పనుల కోసమంటూ రూ.1450 కోట్లు, సుంకిశాల పథకం రుణాల చెల్లింపునకు రూ.1000 కోట్లు, మరో పద్దు కింద రుణాల చెల్లింపునకు రూ.635 కోట్లు కేటాయించింది. నిరుపేదలకు 20వేల లీటర్ల వరకు ఉచిత తాగునీటి పథకానికి రూ. 300 కోట్లు కేటాయింపులు చేశారు. అయితే గత ఏడాది నుంచి ఇప్పటివరకు జలమండలిపై రూ.1850 కోట్ల రుణాల భారం ఉంది. కానీ ఇప్పుడు ప్రభుత్వం గోదావరి జలాల తరలింపు 2-3 దశల పథకానికి టెండర్లు పిలిచింది. రూ.7,360 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ పథకం కోసం జలమండలి ఏకంగా రూ.2,650 కోట్ల రుణాన్ని హడ్కో నుంచి తీసుకుంటున్నది. ఈ క్రమంలో పథకం పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెబుతున్న ప్రభుత్వం.. ప్రత్యేకంగా ఈ పథకానికి కేటాయింపులు చేయలేదు. పైగా ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న బోర్డుపై రుణ భారం కూడా పెరిగి ఆ మొత్తం రూ.4వేల కోట్లకు పైగా చేరుకోనుంది. నానాటికీ నగరం విస్తరించడంతో పాటు కొత్త నిర్మాణాలు, జనాభా పెరుగుదల కోణంలోనూ బోర్డు నిర్వహణ, సేవలపై భారం పెరగనున్నది. దీంతో పాటు ప్రధాన నగరంలో డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకున్న దరిమిలా కొత్త పైపులైన్లు, మంజీరా, జంట జలాశయాలకు సంబంధించి కొత్త పైపులైన్లు వేయాల్సిన అనివార్యత ఉంది. ఈ వ్యవస్థలో భారీ లీకేజీల కారణంగా తరచూ సరఫరాలో అంతరాయంతో పాటు నీటి పరిమాణంలో కోత పడుతుంది.

**కొసమెరుపు:** అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చరిత్రలో ఎన్నడూలేని విధంగా నగరంలోని మ్యాన్‌హోళ్లను ప్రస్తావించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. 'గత కొన్ని దశాబ్దాలకాలంగా ఎప్పుడూ పట్టించుకోని మ్యాన్‌హోల్స్ పూడికతీత పనులు, ఒక స్పెషల్ డ్రైవ్‌గా జలమండలి చేపట్టింది. 3,025 కి.మీ. మురుగునీటి లైన్లు శుభ్రం చేసి 2.39 లక్షల మ్యాన్‌హోల్స్‌లో పూడికతీత పూర్తయింది. ఫలితంగా ఇప్పటివరకు మురుగునీటి వ్యవస్థకు సంబంధించిన ఫిర్యాదులు 25 శాతానికి పైగా తగ్గాయి' అని పేర్కొన్నారు. వాస్తవానికి నిజాం కాలం నుంచి డ్రైనేజీ వ్యవస్థలోని మ్యాన్‌హోళ్ల పూడికతీత అనేది కొనసాగుతుంది. నిర్ణీత కాలంలో పూడిక తీయకపోతే ఆ మ్యాన్‌హోల్ పొంగుతుంది. అందుకే మ్యాన్‌హోళ్ల పూడికతీత అనేది సాధారణంగా చేపట్టే ఒక ప్రక్రియ. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 2.39 లక్షల మ్యాన్‌హోళ్లలో పూడిక తీశామని భట్టి చెప్పడమంటే.. పదేండ్లు మ్యాన్‌హోళ్లలో పూడిక తీయకుంటే మురుగు ఎలా పారింది? అనేది కాంగ్రెస్ ప్రభుత్వానికే తెలియాలి.

## ఆశాలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

మేడ్చల్, మార్చి19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. అసెంబ్లీ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 18 వేల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని, ఫిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతను తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ముట్టడిలో అధ్యక్ష, కార్యదర్శులు ఏ హేమలత, కల్యాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశోక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉన్నీ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. ముట్టడికి తరలి వచ్చిన ఆశా వర్కర్లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

## భూ సేకరణ పక్రియను త్వరగా పూర్తి చేయండి

**అధికారులకు అడిషనల్ కమిషనర్ ఆదేశం**

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకుగానూ రూ. 7032 కోట్లతో చేపట్టిన హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని, అందుకు భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సికింద్రాబాద్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో శివ కుమార్ నాయుడు పర్యటించారు. సికింద్రాబాద్‌లోని పాటిగడ్డ, ఆర్వోబీ, రసూల్‌పుర ఫ్లైఓవర్, ఏఓసీ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం, ఆర్‌కే పురం, చిలకలగూడ ఆర్‌యూబీ పనులకు స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ రోహిణి, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర



రాష్ట్ర మున్నూరు సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

చార్మినార్, మార్చి 19 : భవిష్యత్తులో మున్నూరు కాపుల మనుగడ ప్రశ్నార్థకంగా కాంగ్రెస్ ప్రభుత్వం మర్చివేసిందని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన కులగణనలో మున్నూరు కాపు కులస్తులను అత్యంత తక్కువ కలిగిన జనాభాగా ప్రభుత్వం తన లెక్కల్లో చూపిందని అయన ఆరోపించారు. మున్నూరు కాపు రాష్ట్ర కార్యవర్గ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించనున్న సింహ గర్జన కార్యాచరణ సమావేశం అనంతరం కొండా దేవయ్య మాట్లాడుతూ 33 జిల్లాల అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శుల ముఖ్య సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. బీసీ కులగనలలో మున్నూరు కాపు ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా భవిష్యత్తు కాలంలో మున్నూరు కాపులను అనగా దొక్కడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు కుతంత్రాలతో ప్రయత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో చంద్రయణ గుట్ట నియోజకవర్గ మున్నూరు కాపు అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ తోపాటుగా గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ వాసాల వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్వి మహేందర్ కుమార్, జనరల్ సెక్రెటరీ ముత్యాల రాజశేఖర్ రంగారెడ్డి జిల్లా నాయకులు శక్తి అనంత స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయంపై తిరుగుబాటు చేసిన ధీర వనిత మల్లు స్వరాజ్యం



మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

చిక్కడపల్లి, మార్చి 19: అగ్రకులంలో పుట్టి వందలాది ఎకరాల ఆస్తిపాస్తులుండి కూడా భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం తిరుగుబాటు చేసిన ధీరవనిత మల్లు స్వరాజ్యం అని పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మాహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం స్ఫూర్తి మనమంతా పునికిపుచ్చుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం వ్యక్తి కాదు ఆమె ఒక మహాశక్తి అని అన్నారు. ఈ సమావేశంలోసినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ,సీనియర్ నాయకురాలు టి జ్యోతి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, పి ఓ డబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు సంధ్య, విమలక్క, తదితరులు పాల్గొన్నారు.





ఇఫ్తార్‌విందులో పాల్గొన్న డిజిపి జితేందర్, సిపి సివి ఆనంద్, చిత్రంలో మంత్రి పొన్నం, షబ్బీర్అలీ తదితరులు

## పోలీసుల ఇఫ్తార్ విందు

సిటీబ్యూరో, మార్చి 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బుధవారం చౌహముల్లాప్యాలెస్‌లో ఇఫ్తార్‌విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, సీపీ సీవీ ఆనంద్, ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫేకర్ అలీ, జాఫర్ హుస్సేన్ మేరాజ్, అహ్మద్‌బిన్‌అబ్దుల్లా బలాలా, పోలీస్ అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్, మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, కాంగ్రెస్‌నేతలు షబ్బీర్‌అలీ పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టడమే సర్కార్ లక్ష్యం



వట్టినాగులపల్లిలో ఇసుక బజారును ప్రారంభిస్తున్న అనిల్ కుమార్ తదితరులు

మణికొండ, మార్చి 19 : తెలంగాణ మైన్స్ జియాలజీ సహకారంతో తెలంగాణ మినరల్ డెవలప్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ వద్ద నూతనంగా ఇసుక బజార్ ను బుధవారం ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక బజార్ కార్యక్రమాన్ని తెలంగాణ మినరల్ డెవలప్ కార్పొరేషన్ చైర్మన్ ఈ అనిల్ కుమార్, తెలంగాణ మైన్స్ జియాలజీ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్రీధర్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజి శశాంక్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాలను నివారించే క్రమంలో భాగంగానే ఇసుక బజార్లను ఏర్పాటు చేస్తుందని అన్నారు. సర్కార్ నిర్వహించిన ధరకే ఈ బజార్లో ఇసుక అమ్మకాలు కొనసాగుతాయని నిర్ణయించిన ధరను మించి విక్రయిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ కార్యదర్శి ముంగి జైపాల్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దొడ్డు కిరణ్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కే వేణుగౌడ్, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేతన్ అశోక్ యాదవ్, మాజీ డిప్యూటీ ఎంపీపీ పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసే బడ్జెట్

కంటోన్మెంట్, మార్చి 19: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీతో పాటు ప్రజలను మోసం చేసే విధంగా విధంగా ఉందని కంటోన్మెంట్ కు చెందిన బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. హామీలను గాలికి వదిలేసి, జనాలను మభ్య పెట్టే బడ్జెట్ ను ప్రవేశపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు నమ్మకాన్ని వమ్ము చేసిందని దుయ్యబట్టారు. బడ్జెట్ పై బీఆర్ఎస్ నేతల అభిప్రాయాలు..

## హామీల ఎగవేతల బడ్జెట్..



అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రవేశ పెట్టిన బడ్జెట్ చూస్తే హామీల ఎగవేతల బడ్జెట్ లా ఉందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఇది మొండి చేయి ఇచ్చే బడ్జెట్.. గొప్పలు చెప్పుకొనే బడ్జెట్.. కేవలం 36 వేల కోట్లతో అభివృద్ధి ఎలా సాధ్యమో భట్టి విక్రమార్క చెప్పాలన్నారు. ఈ రాష్ట్రాన్ని దివాలా తీసేలా పెట్టారు అని మండిపడ్డారు. ఆదాయం చరానా.. అప్పు బరానా అన్నట్లు ఉంది.. బడ్జెట్ నిండా అప్పులే ఉన్నాయి.. రాష్ట్ర అప్పులు మరింత పెరిగే సూచికగా ఉంది..

**- మన్నే క్రిశాంక్, మాజీ చైర్మన్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ**

## ఆరు గ్యారెంటీల అమలుకు పంగనామం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరును విశ్లేషిస్తే ఆరు గ్యారంటీల అమలుకు పంగనామాలు పెట్టారు. ముఖ్యంగా గత బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను పరిశీలిస్తే పొంతనే లేదని, అయినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు పెంచి రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసేందుకు బడ్జెట్‌ను సాధనంగా చేసుకోవడం సిగ్గు చేటని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. మహిళలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ గత బడ్జెట్ లోనూ, ఈ బడ్జెట్‌లోనూ నయాపైసా కేటాయించ లేదన్నారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతిపై బడ్జెట్‌లో కేటాయింపులు జరపకపోవడం సిగ్గు చేటు అని తెలిపారు.

**- జక్కుల మహేశ్వర్ రెడ్డి , మాజీ ఉపాధ్యక్షులు, కంటోన్మెంట్ బోర్డు**

## బడ్జెట్‌లో అన్నీ అబద్ధాలే..



రేవంత్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ మండిపడ్డారు. బడ్జెట్ ప్రసంగంలో భట్టి అన్నీ అబద్దాలు చెప్పారని దుయ్యబట్టారు. మహిళా సంఘాలకు లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకున్నారని, కేవలం రూ.5 లక్షల రుణాలు మాత్రమే వడ్డీ లేకుండా ఇచ్చారని మిగతా ఋణాలకు 12 శాతం వడ్డీలు కడుతున్నారని అన్నారు. రూ.4000 ఇస్తామన్న పెన్షన్లు ఊసే లేదని, కొత్తగా ఎవ్వరికీ ఇవ్వలేదని, ఉన్నవే తొలగించారని అన్నారు. రాష్ట్రంలో ఆడపడుచులకు రూ.2500 ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఆ పథకం గురించి మర్చిపోయి అందాల పోటీలకు మాత్రం రూ.250 కోట్లు కేటాయించారని విమర్శించారు.

**- గజ్జెల నాగేష్, మాజీ చైర్మన్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్**

## కాంగ్రెస్ చేసింది శూన్యం: పట్లోళ్ల

మణికొండ, మార్చి 19 : రాష్ట్రంలో ఏడాదిన్నర పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదు కదా చివరకు బడ్జెట్ లోను ఆశించిన స్థాయిలో నిధులను కేటాయించక పోవడాన్ని టీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందించారు. రాష్ట్ర బడ్జెట్ కు ఆర్థిక ఇంజన్ గా పని చేస్తున్న నగరానికి తగిన ప్రాధాన్యతను కల్పించకపోవడం సరి కాదన్నారు. ఏడాదిన్నర కాలంగా రాష్ట్ర ప్రభుత్వం నగరంలో కొత్త రహదారులు, కొత్త వంతెనలు, ఇతర ఏ అభివృద్ధి కార్యక్రమమైన చేపట్టిందా అని ప్రశ్నించారు. అదేవిధంగా ఆదాయ వనరుగా ప్రథమ స్థానంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నగరంతో కలిసి ఉంది. ఈ ప్రాంతం నుంచి ఆదాయం రాబట్టేందుకే సర్కారు పనిచేస్తుంది తప్ప అభివృద్ధి కోసం నిధులు కేటాయించకపోవడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

### ఓయూలో బడ్జెట్ ప్రతుల దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసినందుకు బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బడ్జెట్ ప్రతులను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాగారం ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ లో విద్యా రంగానికి 7.57 శాతం కేటాయించడం దారుణం అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా 15శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే 7.3 శాతం, ఈ ఏడాది 7.57 శాతం ఇచ్చి విద్యార్థులను మరొక్క సారి మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తమ హామీ నెరవేర్చే వరకు విద్యార్థుల తరుపున బీఆర్ఎస్వీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు

## డాక్టర్ పిఎస్. రావు కన్నుమూత

శామీర్ పేట్, మార్చి 19 : నల్సార్ యూనివర్సిటీ అనుబంధ ప్రొఫెసర్, విశిష్ట అంతర్జాతీయ న్యాయనిపుణుడు, ఇంటర్నేషనల్ ట్రేడ్ అండ్ బిజినెస్ లాస్ యొక్క సెంటర్ ఫర్ మా డైరెక్టర్ డా. పెమ్మ రాజు శ్రీనివాస రావు (83) బుధవారం మరణించారు. ఈ సందర్భంగా యూనివర్సి టీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నల్సార్ వైస్ ఛాన్సలర్ , ప్రొ.శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయ శాస్త్రంలో ఎంతో పట్టు ఉండిన రావు అంతర్జాతీయ చట్టాల రూపకల్పన ,అమలు కోసం ఆయన చేసిన కృషి వారికి శాశ్వతమైన కీర్తిని మిగిల్చిందన్నారు.

## మున్నూరు కాపు సింహగర్జనకు సిద్ధం కండి

కాచిగూడ, మార్చి 19: ప్రభుత్వం తీరు పట్ల తెలంగాణలోని మున్నూరుకాపులు వ్యతిరేకంతో ఉన్నారని, త్వరలో హైదరాబాదులో 10 లక్షల మందితో మున్నూరు కాపు సింహ గర్జనను నిర్వహించనున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. బుధవారం రాత్రి కాచిగూడ మున్నూరు కాపు సంఘం లో 33 జిల్లాల మున్నూరు కాపు సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండ దేవయ్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన కులగనన లో మున్నూరు కాపులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ వి మహేందర్ కుమార్, చందు,జనార్ధన్, కొత్త లక్ష్మణ్, పటేల్ తదితరులు పాల్గొన్నారు.